క్లుప్తంగా

ఎస్వీయూలో వీసీ ఆకస్మిక తనిఖీలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ అకడమిక్, పరీక్షల విభాగాలలో వీసీ సీహెచ్ అప్పారావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫైళ్ల మందగమనంపై ఆరా తీశారు. పరీక్షల విభాగంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు సకాలంలో ధ్రువపత్రాలను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. వర్సిటీలో సిబ్బంది అలసత్వానికి చోటు ఇవ్వరాదని చెప్పారు.

మామిడిలో కొమ్మల కత్తిరింపులు చేపట్టండి

రామచంద్రాపురం: రైతులు మామిడిలో కొమ్మల కత్తిరింపులు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి సునీల్ అన్నారు. సోమవారం మండలంలోని నెత్తకుప్పం గ్రామ పంచాయతీలోని రైతులకు మామిడి సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కొమ్మలు కత్తిరించడం ద్వారా సూర్యరశ్మి బాగా సోకి తేనెమంచు పురుగు, బంక కారడం, ఇతర చీడపీడలు తగ్గుతాయని చెప్పారు. కొమ్మ కత్తిరింపులు తర్వాత బ్లీటాక్స్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు భరత్, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

భాకరాపేట సీఐగా ఇమ్రాన్‌బాషా

భాకరాపేట: భాకరాపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇమ్రాన్‌బాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. భాకరాపేట సీఐ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానం నెల రోజులుగా ఖాళీగా ఉంది. తిరుపతి సైబర్‌క్రైం నుండి ఇమ్రాన్‌బాషా భాకరాపేట సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో ఆస్కారం ఇవ్వమన్నారు.

ఇసుక లారీ బోల్తా

చంద్రగిరి: ప్రమాదవశాత్తు ఇసుక లారీ బోల్తా పడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ధనమూర్తిపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తిరుపతి నుంచి చిత్తూరు వైపు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ధనమూర్తిపల్లి వద్ద అదుపు తప్పి, రహదారి పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో లారీ ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో తిరుపతి రుయాకు తరలించారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి ఆలయ పేష్కార్‌గా రామకృష్ణ



తిరుమల: శ్రీవారి ఆలయ పేష్కార్‌గా కేఎస్ రామకృష్ణ, అదేవిధంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్–2 ఏఈఓగా పి.శ్రీహరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీహరి బదిలీపై వైకుంఠం క్యూకాంప్లెక్స్–2 ఏఈఓగా నియమితులయ్యారు. వారు మాట్లాడుతూ.. టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఆదేశాలతో భక్తులకు మెరుగైన దర్శన సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు.

హక్కుల సాధన సదస్సుకు తరలిరండి

తిరుపతి కల్చరల్: యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే రాయలసీమ సమగ్ర శిక్షా ఉద్యోగుల హక్కుల సాధన ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నాగ వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం వేమన విజ్ఞాన కేంద్రంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా తిరుమలనంబి అవతార మహోత్సవం



లడ్డూ ప్రసాదాలు అందజేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల: భగవంతుడి సేవే పరమావధిగా భావించి తిరుమలనంబి జీవితం మొత్తాన్ని శ్రీవారి కైంకర్యానికి అంకితం చేశారని శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అన్నారు. ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1,051వ అవతార మహోత్సవం సోమవారం తిరుమలలోని దక్షిణ మాడ వీధిలోని తిరుమలనంబి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. అనంతరం ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 16 మంది ప్రముఖ పండితులు శరణాగతి తత్వాన్ని గురించి ప్రసంగించారు. టీటీడీ ఏఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ప్రోగ్రాం అధికారి పురుషోత్తం, తిరుమలనంబి వంశీకులు తాతాచార్య కృష్ణమూర్తి, సి.రంగనాథన్ పాల్గొన్నారు.



టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓడీ డాక్టర్ లక్ష్మీ



కలంకారీ పెయింటింగ్ వేస్తున్న విద్యార్థినులు

హస్త కళలకు... ఆధునిక ఆకృతి

మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి బీఎస్సీ హోమ్ సైన్స్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. సాంప్రదాయ హస్తకళలకు ప్రాణం పోస్తూ ఆధునిక గృహాలంకరణ వస్తువులను ఆకట్టుకునే రీతిలో తీర్చిదిద్దుతున్నారు. ఫొటో ఫ్రేమ్‌లు, గిఫ్ట్ ఐటమ్స్, వాల్ డిజైన్‌లతో కార్పొరేట్ సంస్థలకు దీటుగా వస్తువులను తయారు చేసి ఔరా అనిపిస్తున్నారు. – తిరుపతి సిటీ

- ఎస్పీడబ్ల్యూ కళాశాల హోమ్‌సైన్స్ విద్యార్థుల అమోఘ నైపుణ్యం
- కలంకారీ, ఫ్యాబ్రిక్, గ్లాస్ పెయింటింగ్‌తో ఆకట్టుకునే ఆకృతులు
- సృజనాత్మకత గుర్తించి ప్రోత్సహిస్తున్న అధ్యాపకులు
- వందల రకాల పెయింటింగ్‌లపై ప్రత్యేక శిక్షణ

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినుల ప్రతిభకు నిలయంగా మారింది. అకడమిక్ విద్యతోపాటు క్రీడా, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, కాంపిటీటివ్ రంగాలలోని తమ సత్తా చాటుతున్నారు. ఇందులో భాగంగా కళాశాల హోమ్‌సైన్స్ విభాగంలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు హస్తకళలల్లో ప్రావీణ్యం సాధించారు. అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన బోధనతో పలు రకాల ఆకృతులను స్వయంగా తయారు చేస్తున్నారు. విద్యార్థినుల్లోని సృజనాత్మకతను గుర్తించిన అధ్యాపకులు వారిని ప్రోత్సహిస్తున్నారు.

సాంప్రదాయ కళలతో ఆధునికత మేళవింపు

భారతీయ సంస్కృతి ఉట్టిపడే సాంప్రదాయ కళలకు పద్మావతి కళాశాల విద్యార్థినులు ఆధునిక ఆకృతులను జోడించి ఆకట్టుకునే పెయింటింగ్ బొమ్మలను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా ఫ్యాబ్రిక్, గ్లాస్ పెయింటింగ్, క్లే వర్క్, పేస్టల్ ఆర్ట్స్, డైయింగ్, లిప్పాన్ ఆర్ట్స్, టౌన్ జోర్ పెయింటింగ్, కలంకారీ డిజైనింగ్ తదితర కళలకు ఆధునిక పద్ధతులను జోడించి వస్తువులను తయారు చేస్తున్నారు.



ఫెవీక్రిల్ రంగులను ఉపయోగించి తయారు చేస్తున్న వస్తువులు పేరొందిన కళాకారులకు సైతం తీసిపోని విధంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ పెయింటింగ్ వస్తువులను హస్తకళల ప్రదర్శనల్లో విక్రయించే ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు.





విద్యార్థులు తయారు చేసిన పలు రకాల వస్తువులు

విద్యలో భాగంగా హస్తకళలు



కళాశాలలో అధ్యాపకులు విద్యతోపాటు హస్తకళలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నారు. విద్యలో హస్తకళలు భాగం కావడంతో నాకు పెయింటింగ్‌పై మక్కువ కలిగింది. హోమ్ సైన్స్ అధ్యాపకుల సహాయసహకారాలతో పలు రకాల ఫ్యాబ్రిక్, గ్లాస్ పెయింటింగ్ వర్క్‌ను నేర్చుకున్నాను. లిప్పాన్ ఆర్ట్‌పై ప్రత్యేక ఆసక్తి ఉంది. ఇంటీరియర్, గిఫ్ట్ ఐటమ్స్ వంటివాటికి చాలా రిచ్‌గా ఉంటాయి. మా ఆసక్తిని చూసి కళాశాల అధ్యాపకులు ప్రోత్సహించడం సంతోషంగా ఉంది.

– హరిత, బీఎస్సీ విద్యార్థిని, ఎస్పీడబ్ల్యూ కళాశాల

విద్యతోపాటు చేతి వృత్తులపై శిక్షణ



బీఎస్సీ హోమ్ సైన్స్‌లో ఫైనలియర్ చదువుతున్నా. పద్మావతి కళాశాలలో విద్యతోపాటు ఉపాధి, ఉద్యోగావకాశాలే లక్ష్యంగా అధ్యాపకులు హస్తకళలపై శిక్షణ ఇస్తున్నారు. చిన్ననాటి నుంచి డ్రాయింగ్, పెయింటింగ్‌పై ఆసక్తి ఉండేది. కానీ ప్రోత్సహించే వారు లేరు. ప్రస్తుతం కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహంతో మా కోరిక తీరింది. కలంకారీ డిజైన్‌తో శారీస్, డ్రస్ మెటీరియల్స్, ఫ్రేమ్‌లపై వేసుకోవచ్చు. చాలా అందంగా గృహాల్లో వాల్స్‌పైనా అలంకరించుకోవచ్చు. స్వతహాగా ఎటువంటి డిజైన్ ఇచ్చినా వేసేంత ప్రతిభను అధ్యాపకులు నేర్పించారు.

– టి.సౌమ్య, బీఎస్సీ విద్యార్థిని, ఎస్పీడబ్ల్యూ కళాశాల

హస్తకళలకు ప్రాణం పోస్తున్నాం



హోమ్ సైన్స్ విభాగంలో విద్యార్థినులకు హస్తకళలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రాచీన సాంప్రదాయ కళలకు ఆధునికత జోడించి ఆకర్షణీయమైన డిజైన్‌లలో వస్తువులను స్వతహాగా తయారు చేస్తున్నాం. వాస్తవంగా కళాశాలలో హస్తకళలకు ప్రాణం పోస్తున్నారనే చెప్పాలి. క్లే వర్క్, పేస్టల్ ఆర్ట్స్, డైయింగ్, లిప్పాన్ ఆర్ట్స్, టౌన్ జోర్ పెయింటింగ్, కలంకారీ డిజైనింగ్‌లలో వందల సంఖ్యలో తయారు చేశాం. ఇలాంటి శిక్షణ అందించిన అధ్యాపకులకు ధన్యావాదాలు.

– ఎస్.మౌనిక, బీఎస్సీ హోమ్‌సైన్స్ విద్యార్థిని, ఎస్పీడబ్ల్యూ కళాశాల, తిరుపతి

ప్రతిభను గుర్తించి.. ప్రోత్సహిస్తున్నాం



విద్యార్థినులు చదువుతోపాటు హస్తకళలలో సైతం రాణిస్తున్నారు. యువతలోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహిస్తున్నాం. టీటీడీ అధికారుల సహాయసహకారాలతో విద్యార్థినులకు అన్ని రంగాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధి, ఉద్యోగావకాశాలే లక్ష్యంగా కళాశాలలో నూతన విద్యా విధానం అమలు చేస్తున్నాం. పద్మావతి కళాశాల విద్యార్థినులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. హోమ్ సైన్స్ విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసుకున్న తర్వాత ఎన్నో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉపాధి పొందుతున్నారు. అధ్యాపకులు విద్యార్థినుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయం.

– టి.నారాయణమ్మ, ప్రిన్సిపల్, ఎస్పీడబ్ల్యూ కళాశాల, తిరుపతి

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాం



పద్మావతి కళాశాల బీఎస్సీ హోమ్‌సైన్స్ విద్యార్థులలో ప్రతిభకు కొదువలేదు. అకడమిక్ విద్యలో భాగంగా గృహనిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి శిక్షణ ఇస్తున్నాం. హస్తకళలతో పాటు సరికొత్త ఫుడ్ ఐటమ్స్‌ను సైతం తయారు చేసే విధంగా తీర్చిదిద్దాం. బీఎస్సీ పూర్తి చేసుకున్న ఎంతో మంది విద్యార్థులు టెక్స్‌టైల్, హోటల్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలు, ఇంటీరియర్ డెకరేషన్ రంగాలలో రాణిస్తున్నారు. ఇప్పటికే నగరంలో జరిగిన ఎన్నో కుకింగ్, హస్తకళల ప్రదర్శనలలో విద్యార్థులు ప్రతిభ చూపారు.

– డాక్టర్ వి.లక్ష్మీ, హెచ్ఓడీ, శ్రీవాణి, అధ్యాపకులు, బీఎస్సీ హోమ్‌సైన్స్ విభాగం, ఎస్పీడబ్ల్యూ, తిరుపతి

నిర్ణీత సమయంలో వినతుల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి

తిరుపతి తుడా: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 25 వినతులు వచ్చాయి. ప్రజల నుండి వచ్చిన వినతులు స్వీకరించిన అదనపు కమిషనర్ సమస్యలు తెలుసుకున్నారు. వినతులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వినతుల్లో ముఖ్యంగా తన బిడ్డకు పెన్షన్ ఇప్పించాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని, టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని, గృహాలు కావాలని తదితర సమస్యలు ప్రజల నుండి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, సెక్రటరీ రాధిక, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఆర్ఓ లు సేతుమాధవ్, కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులతో మహిళల ఆర్థికాభివృద్ధి



ఉచితంగా టైలరింగ్ ముడిసరుకులు అందజేస్తున్న రాస్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రతి మహిళ చేతివృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తూ కుటుంబాలకు బాసటగా నిలవాలని రాస్ మహిళా పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు పిలుపునిచ్చారు. రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కోసం రాస్ జన్ శిక్షణ్ సంస్థ నిర్వహించే వివిధ రకాల చేతివృత్తుల శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. అనంతరం టైలరింగ్ శిక్షణకు వచ్చిన మహిళలకు ఉచితంగా టైలరింగ్ ముడి సరుకులను అందజేశారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ, సత్యనారాయణ, 50 మంది మహిళలు పాల్గొన్నారు.



గణనాథుని లడ్డూ వేలం

తిరుపతి జర్నలిస్ట్ కాలనీలోని వినాయక మండపంలో నిర్వహించిన వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న చిన్నారులు మోక్షశ్రీ, నేత్రశ్రీ
-తిరుపతి తుడా

వైభవంగా వినాయక నిమజ్జనం



వినాయక నిమజ్జనం చేస్తున్న యువకులు

రామచంద్రాపురం: వినాయక చవితి వేడుకల్లో భాగంగా మూడో రోజు గణేశుడి విగ్రహాల నిమజ్జనం సోమవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని రాయలచెరువుకట్ట వద్ద స్థానిక తహసీల్దార్ వెంకటరమణ, ఎస్ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట మండలాల నుంచి వివిధ వాహనాలలో విగ్రహాలను యువకులు డప్పులు, కేరింతలు కొడుతూ జై గణేశా జై గణేశా అంటూ నినాదాలు చేస్తూ తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రమణయ్య, యోబు, ధనుంజయులు, రమేష్, త్యాగరాజులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు పలువురు వీఐపీల రాక

తిరుపతి అర్బన్: కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, టూరిజం సహాయ మంత్రి సురేష్ గోపి మంగళ, బుధవారాలు జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఏర్పాటు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్చంద్ గెహ్లాట్ మంగళ, బుధవారాలు జిల్లాలో పర్యటిస్తారని స్పష్టం చేశారు. అవసరమైన మేరకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

నేడు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి వర్ధంతి

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అన్నమాచార్య కళా మందిరంలో సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి 43వ వర్ధంతితోపాటు గౌరిపెద్ది రామసుబ్బశర్మ 102వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9.15 గంటలకు శ్వేత భవనం ఎదురుగానున్న సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి విగ్రహానికి, 9.45 గంటలకు ఎస్వీ ఓరియంటల్ కళాశాలలోని గౌరిపెద్ది రామసుబ్బశర్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. అనంతరం 10.30 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి వర్ధంతి సభ నిర్వహిస్తారు. ఇదే రోజు సాయంత్రం 5 గంటలకు గౌరిపెద్ది రామసుబ్బశర్మ జయంతి సభ నిర్వహిస్తారు.

మొక్కల సంరక్షణకు నడుం బిగించాలి

తిరుపతి తుడా: చెట్ల నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా చేపట్టాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ అన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. భవిష్యత్తులో ఆక్సిజన్ కొరత రాకుండా ఉండాలంటే మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు. తిరుపతి పీపుల్స్ చారిటీస్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మూర్తి, మనోహర్, విజయ్ కుమార్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ గుర్తింపు తప్పనిసరి

తిరుపతి అర్బన్: కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ గుర్తింపు పొందిన సంస్థలే స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు ఉందని తెలిపారు. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో నకిలీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలియడంతో ఆయన ప్రకటన విడుదల చేశారు.

రేపు విద్యుత్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక

తిరుపతి రూరల్: తిరుపతి సర్కిల్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగుల లాంగ్ టెన్నిస్, షటిల్ జట్ల సెలక్షన్స్‌ను బుధవారం నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్, గేమ్స్ జనరల్ సెక్రటరీ లీలారామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి సర్కిల్ పరిధిలో ఆసక్తిగల విద్యుత్ పర్మినెంట్, జేఎల్ఎం గ్రేడ్ –2 ఉద్యోగులు లాంగ్ టెన్నిస్ ఎంపికకు ఉదయం 7 గంటలకు తిరుపతి 132 కేవీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలోని టెన్నిస్ కోర్టు వద్దకు చేరుకోవాలని కోరారు. షటిల్ క్రీడాకారులు ఉదయం 10 గంటలకు తిరుపతి బాలాజీ కాలనీలోని ఆఫీసర్స్ క్లబ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: నులిపురుగుల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన వైద్యాధికారులతో కలసి 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన రెండో విడత కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదగడం కోసం నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ చప్పరించే మాత్రలను తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, ప్రోగ్రాం అధికారి ఆర్బీఎస్కే పద్మావతి, డీఈఓ శేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీసీహెచ్ఎస్ ఆనంద రావు, జిల్లా ఎపిడమాలజిస్ట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని అయినా గురువుకు శిష్యుడే...



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని రూత్‌పావనికి సత్కారం

పాకాల: దేశ ప్రధానమంత్రి కూడా ఒక గురువుకు శిష్యుడే అని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు ఉపాధ్యాయులకు సన్మానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ మాట్లాడుతూ సమాజంలో అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ప్రత్యేకమైనదన్నారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజున ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఎంఈఓలు బాబ్జి, లింగయ్య, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సుబ్రమణ్యం, శ్రీరంజని, రూత్‌పావని, మండల ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మహమ్మద్ రఫీ, నాగరాజ, సుమలత, చౌదరి, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుయాలో నర్సుల ఆందోళన



రుయా వద్ద ఆందోళన చేస్తున్న స్టాఫ్ నర్సులు

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రిలో నర్సులు ఆందోళన బాట పట్టారు. విధులను బహిష్కరించి పరిపాలన భవనం వద్ద సోమవారం తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. సీనియారిటీ ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు నినదించారు. కాంట్రాక్ట్ నర్సుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయంలో పనిచేసే ఏఎన్ఎంల అర్హత ఆధారంగా స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 115ను విడుదల చేసింది. ఈ జీవోను వ్యతిరేకిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల ప్రతినిధులు మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ కోర్సులను పూర్తి చేసి రోస్టర్ పద్ధతిని ఎంపికైన తమకు శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు వినతి పత్రాన్ని అందజేశారు.

కలెక్టరేట్‌లోని గణపతి నిమజ్జనం



గణపతి నిమజ్జనంలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఆర్ఓ పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో వినాయక చవితి సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని వేడుకగా చేపట్టారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు డీఆర్ఓ పెంచల కిషోర్, కలెక్టరేట్ ఉద్యోగులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి అర్బన్: రుయా, మెటర్నిటీ ఆస్పత్రులతోపాటు ఎస్వీ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో విన్నవించారు. వారితోపాటు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మహేంద్ర పలు సమస్యలు తెలిపారు. ప్రధానంగా పెండింగ్ జీతాలు ఇవ్వాలని సూచించారు. పీఎఫ్ కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 226 మంది చేయాల్సిన పనిని 90 మందితో చేయిస్తూ మిగిలిన సొమ్ము మింగేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో కలెక్టర్ సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని వారికి భరోసా కల్పించారు.